క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



లంకపేటలో చిన్నారులతో పీఎంఓ కోమలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోగల ఫస్ట్ సెక్టార్ లంకపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని పీఎంఓ కోమలి శుక్రవారం సందర్శించారు. ప్రీస్కూల్ యాక్టివిటీస్‌ను పరిశీలించారు. సాంఘిక భావోద్వేగాభివృద్ధి, మేధాభివృద్ధి, శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, ఈ అభివృద్ధిని పిల్లలకు ఏ విధంగా ఉపయోగపడతాయో కార్యకర్తకు వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.పద్మావతి, సూపర్‌వైజర్ మంగ, స్టేట్ కోఆర్డినేటర్ ప్రదం జగదీష్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. రెహమత్ నగర్, చొడు దిబ్బ, ద్వారకానగర్ అంగన్‌వాడీ కేంద్రాలను కోమలి సందర్శించారు.

పింఛన్ల పునఃపరిశీలన



తంగెళ్లమూడి ప్రాంతంలో పింఛన్‌దారుని ఇంటి వద్ద పరిశీలన చేస్తున్న అధికారులు

ఏలూరు (టూటౌన్) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పరిశీలన ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం గుంటూరు, విజయవాడ, ఒంగోలు నుంచి ప్రభుత్వ వైద్యులు జిల్లాలోని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 90 మంది పింఛన్‌దారుల ఇళ్లకెళ్లి వారి అర్హతను పరిశీలించారు. ఏలూరులోని తంగెళ్లమూడి, శనివారపుపేట, మోతేవారి తోట, నూకాలమ్మ గుడి ఏరియాల్లో పెన్షన్ పునఃపరిశీలన చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, డీసీహెచ్‌ఎస్ శ్రీ పాల్ సతీష్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

నేడు వడ్డే ఓబన్న జయంతి

ఏలూరు(మెట్రో): స్వాతంత్య్ర సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని శనివారం ఉదయం 7.30 గంటలకు ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి తెలిపారు.

జిల్లా పరిషత్ సమావేశం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మండల పరిషత్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. అధికారులు పాల్గొన్నారు.

భయం వద్దు.. భద్రతే ముఖ్యం



ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

- హెచ్‌ఎంపీవీ వైరస్ కలకలం
- ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

ఏలూరు టౌన్: కరోనా విలయతాండవం చేస్తూ ప్రపంచాన్ని వణికించింది. మానవ మనుగడకు సవాల్ విసురుతూ ఎంతోమందిని పొట్టనబెట్టుకుంది. మరెన్నో కుటుంబాల్లో కన్నీటిని మిగిల్చింది. తాజాగా కరోనా తరహాలో హ్యూమన్ మెటాఫ్ న్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇది మన దేశంలోకి ప్రవేశించినా ప్రస్తుతం మన రాష్ట్రంలో ఏలాంటి కేసులు నమోదు కాలేదు. ఏలూరు జీజీహెచ్‌లో ముందుస్తుగా ప్రత్యేకంగా ఐసీయూ బెడ్లను సిద్ధం చేశారు. ఈ వైరస్‌కు భయపడాల్సిన పనిలేదని, అప్రమత్తంగా ఉంటే చాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

లక్షణాలు ఇలా

కోవిడ్‌-19 మహమ్మారి తరహాలో ఫ్లూ, శ్వాసకోశ సమస్యలు హెచ్‌ఎంపీవీలోనూ ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వైరస్ సోకిన మూడు నుంచి ఆరు రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, అతిసారం, చర్మంపై దద్దుర్లు, ఆందోళన వంటి లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన లక్షణాల్లో ఊపిరి ఆడకపోవటం, శ్వాస కోశ నాళాలను దెబ్బతీస్తూ ఊపిరి తీసుకోవటంలో తీవ్ర సమస్య, ఛాతి నొప్పి, తీవ్రమైన ఒంటి నొప్పులు, జ్వరం, జలుబు ఉంటాయి. ఇక బ్రాంకైటిస్, న్యూమోనియా వంటి వ్యాధుల బారినపడే అవకాశం అధికంగా ఉంటుంది. వృద్ధులు, చిన్నారులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చల్లటి వాతావరణంలో త్వరగా వ్యాప్తి చెందుతుంది.

భయం వద్దు



హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల భయపడాల్సిన అవసరం లేదు. అప్రమత్తంగా ఉండాలి. ఈ వైరస్ సోకితే సీజనల్ వ్యాధుల వంటి లక్షణాలు ఉంటాయి. జలుబు, జ్వరం, ముక్కు కారటం ఉంటుంది. కొందరిలో ఆయాసం రావటం, తీవ్రమైన ఒంటి నొప్పులు, ఫ్లూ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇతరులకు వ్యాప్తి చెందకుండా మాస్కు ధరించటం మంచిది. చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. పరిశుభ్రమైన ఆహారాన్ని భుజించాలి.

– ఆర్ మాలిని, వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఏలూరు

22 బెడ్లతో పాటు ఆక్సిజన్ సౌకర్యం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ముందుస్తుగా హెచ్‌ఎంపీవీ రోగుల కోసం ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశాం. 22 బెడ్లతో పాటు ఆక్సిజన్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాం. ప్రజలు ఆయాసం, తీవ్రమైన జ్వరం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. పరీక్షల అనంతరం ఆరోగ్య స్థితిని పరిశీలించి చికిత్స అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో హెచ్‌ఎంపీవీ సోకిన బాధితులు ఎవరూ నమోదు కాలేదు.

– ఎంఎస్ రాజు, సూపరింటెండెంట్, ఏలూరు జీజీహెచ్

మార్మోగిన గోవింద నామస్మరణ



ఆర్ఆర్‌పేటలోని స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అగ్రహారంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

- వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు
- బారులు తీరిన భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరం గోవింద నామస్మరణతో మార్మోగింది. మార్గశిర శుద్ధ ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) పర్వదినం సందర్భంగా శుక్రవారం పలు వైష్ణవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచి స్వామి వార్ల ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు బారులు తీరారు. స్వామి వార్లకు విశేష అలంకరణ చేశారు. రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం రాత్రి 8 గంటల వరకు ఏర్పాటు చేశారు. అగ్రహారం భూనీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ఉదయం నుంచి వైకుంఠద్వార దర్శనాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి మత్స్యావతార అలంకరణ చేశారు. పవర్‌పేటలోని వాసు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు జగన్మోహిని అలంకరణలో భక్తులకు ఉత్తరద్వార దర్శనమిచ్చారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రం, పవర్‌పేట బడేటి వారి వీధి కోదండ రామాలయం, తూర్పువీధి సంతాన వేణుగోపాల స్వామి తదితర ఆలయాల్లో స్వామి వార్ల ఉత్తర ద్వారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



ఉత్తరద్వార దర్శనమిస్తున్న స్వామివారు



ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న జనార్ధనస్వామి

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	06
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	14

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	56	బీన్లచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	40-48	చామదుంపలు	44
బెండకాయలు	50	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	34	కంద	68
కాకర కాయలు	40-44	బీట్‌రూట్	46
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	50	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	50	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	32-36	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

పేదల ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు రూరల్ : పేదల ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లు పేదలకు అందించాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాలో ఉప్పులూరి ఉమాశంకర్, కొండేటి బేబి, పుప్పాల కన్నబాబు, మావూరి విజయ,నాగం అచ్యుత్, కొల్లూరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులకు ఉపప్రణాళిక ఏర్పాటు చేయాలి



క్యాలెండర్‌ను విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): వృత్తుల రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, సామాజిక భద్రత కోసం వృత్తిదారులకు ఉప ప్రణాళికను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని సుందరయ్య గ్రంథాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీసీ జేఏసీ నాయకుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ విడుదల చేశారు. ఆదిశేషు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో వృత్తిదారుల్లో ముఖ్యంగా చేనేత కార్మికుల కుటుంబానికి ఏడాదికి రూ.24,000 చొప్పున బ్యాంకులో నగదు జమ చేశారని, ఈ ఏడాది చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేతివృత్తిదారుల జీవన ప్రమాణం మెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జనాభా ప్రాతిపదికన వృత్తుల వారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం, కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు ఎం ఇస్సాక్, వృత్తి సంఘాల నాయకులు గనిగంటి కోటేశ్వరరావు, గౌడు రంగబాబు, బలరాం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అందుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని అందుకోవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా యువజన అధికారి డి.కిషోర్ పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం, సెట్‌వెల్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, డిబేట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణ రావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం, సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తాళ్లపూడికి చెందిన తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి శ్రీమద్రామాయణం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ద్రోణంరాజు శైలజ, కె.రాజేశ్వరిచే భక్తి సంగీత కచేరి అలరించారు. రాత్రి సీహెచ్ రేహజ్ఞ బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన, అనంతరం శ్యామలాంబ కళానికేతన్ వారి మోహినీ భస్మాసుర కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలి



డైరీ విడుదల చేసిన డీఈఓ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దుతూ వృత్తికి వన్నె తీసుకురావాలని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం ఆమె తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్ అసోసియేషన్ నాయకులు చెరుకూరి వెంకటరమణారావు, తనగాల మురళి, భూక్యా రాము, డి.ఇంద్రాణి, తనగాల విజయానందం, కన్వీనర్ చేకూరి రఘు కుమార్, కె.మల్లేశ్వర రావు, బాలాజీ, తోట ఎడ్వర్డ్ తదితరులు పాల్గొన్నారు.

డీఏఓను కలిసిన వ్యవసాయ సహాయకులు



బాషాను కలిసిన వ్యవసాయ సహాయకులు

ఏలూరు రూరల్ : ఏలూరు జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొర్లపాటి కుమార్, జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి వినోద్ సంఘం సభ్యులతో కలిసి శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాషాను కలిశారు. ఈ సందర్భంగా హబీబ్‌బాషా, జిల్లా వ్యవసాయ అధికారి సంఘం అధ్యక్షులు బాలిన వెంకటేష్, చౌలం పవన్‌కుమార్ సంఘం కేలండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గుడిదల బాలర్జున్, తాడిగడప స్వర్ణలత, పంజా కాశీప్రసాద్, మెంతుల వరిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి సుందరీకరణ



సుందరీకరణ పనులపై మాట్లాడుతున్న కమిషనర్ భాను ప్రతాప్

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి పండుగ సందర్భంగా విచ్చేసే అతిథులను ఆహ్వానిస్తూ ఏలూరు నగరాన్ని సుందరకరిస్తున్నట్టు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వారు స్థానిక జూట్ మిల్లు సెంటర్లో సుందరీకరణ పనులను పరిశీలించారు. నగరంలో ప్రధాన రహదారుల డివైడర్లలో ఉన్న వీధిలైట్ల స్తంభాలకు రంగురంగుల ఎల్ఈడీ తోరణాలతో అలంకరిస్తున్నామని తెలిపారు. శనివారం కూడా పరిశుభ్రత – సుందరీకరణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నిరు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, అధికారులు, కార్పొరేటర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి



విభిన్న ప్రతిభావంతుల హాస్టల్‌ను సందర్శించిన రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మానసిక విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. తంగెళ్లమూడిలోని విన్సెంట్ డీపాల్ మానసిక విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో అందిస్తున్న వైద్య, ఆహార సౌకర్యాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలను పొందటంలో లేదా ఆస్తుల పొందటంలో సమస్యలు ఉంటే ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. న్యాయ సలహాలకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. సిస్టర్ అన్నే డీసీ, ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ మోహన్‌రావు పాల్గొన్నారు.